
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
బుధవారం 22 మే 2024
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 37.0 కనిష్ఠం : 26.0



పీయూ ఇన్‌చార్జి వీసీగా నదీమ్‌అహ్మద్

మహబూబ్‌నగర్, మే 21: పాలమూరు యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా ఐఏఎస్ అధికారి నదీమ్‌అహ్మద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుత వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ మూడేళ్ల పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో కొత్త అధికారిని నియమించారు. కొత్త వీసీ బాధ్యతలు చేపట్టే వరకు ఆయన విధుల్లో కొన సాగుతారు. నదీమ్ అహ్మద్ ఇదివరకు లేబర్ కమిషనర్‌గా ఉండగా, పదోన్నతిపై ఈ ఏడాది జనవరిలో ప్లానింగ్ బోర్డ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ అయ్యారు. పాలమూరు యూని వర్సిటీకి ఇప్పటివరకు నలుగురు రెగ్యులర్ వీసీలు పనిచేశారు. ఒకరు ఇన్‌చార్జిగా పని చేయగా, ప్రస్తుతం మరో అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు.

పచ్చదనం పెంచేలా

- హరితహారానికి ముమ్మర ఏర్పాట్లు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యం
- 1,500 నర్సరీల్లో సిద్ధమౌతున్న మొక్కలు
- వానలు పడగానే నాటేందుకు ప్రణాళిక



వనపర్తి పట్టణంలోని మర్రికుంట నర్సరీలో పెంచుతున్న మొక్కలు



నాటేందుకు సిద్ధంగా ఉన్న వివిధ రకాల మొక్కలు

వనపర్తి అర్బన్, మే 21: ఉమ్మడి జిల్లాలో హరిత హారం కార్యక్రమానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే రాష్ట్ర ఉన్నతాధికారులు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయగా, అందుకు సంబంధించిన ఏర్పాట్లలో అధికా రులు నిమగ్నమయ్యారు. ఏటా మాదిరిగా ఈసారీ అధిక సంఖ్యలో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందిం చారు. నర్సరీలలో మొక్కలను సిద్ధం చేస్తున్నారు. భారీ వర్షాలు పడగానే మొక్కలను నాటనున్నారు.



మొక్కలకు నీరు పడుతున్న మహిళ

1,500లకు పైగా నర్సరీల్లో మొక్కల పెంపకం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,500లకుపైగా నర్సరీలు ఉన్నాయి. ఈ ఏడాది రెండు కోట్ల కుపైగా మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టు కున్నారు. అందుకు తగ్గట్టు డీఆర్‌డీఏ విత్తనాలను కొని, నర్సరీలలో మొక్కలను పెంచుతున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థతో పాటు అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో కోటి మొక్కలు నాటాలని నిర్ణ యించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 40 లక్షలు, జోగుళాంబ గద్వాల జిల్లాలో 25 లక్షలు, నారాయణపేట జిల్లాలో 11 లక్షలా 25 వేలు, వనపర్తి జిల్లాలో 13 లక్షల మొక్కలు నాటాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ప్రజలకు ఇంటింటికి మొక్కలు పంపిణీ చేయడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రోడ్ల వెంట, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, అసైన్డ్ భూములు, అడవుల్లో మొక్కలు నాటను న్నారు. దీనికి సంబంధించి ప్రజల భాగస్వామ్యంతో పాటు వివిధ శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించింది. జూలై, ఆగస్టు నెలల్లో భారీ వర్షాలు ప్రారంభం కాగానే మొక్కలు నాటనున్నారు.

పేరు ఉంటుందా?.. మార్చుతారా?

హరితహారం కార్యక్రమం పేరును ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేక కొత్త పేరుతో చేపడుతుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో పచ్చదనం పెంచాలనే లక్ష్యంతో 2015 జూలై మూడున అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణకు హరితహారం అనే పేరుతో మొక్కలు పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి 2023 వరకు తొమ్మిది విడతల్లో మొక్కలు నాటారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పేరును కొనసా గిస్తుందా? లేదా? అన్నది తేలాల్సి ఉంది.

మత్స్య సంఘాల్లో.. ఇష్టారాజ్యం



మహబూబ్‌నగర్ పట్టణంలోని మత్స్యశాఖ జిల్లా కార్యాలయం

- తమకు నచ్చిన వారికే సంఘాల్లో అవకాశం కల్పిస్తున్న అధ్యక్షులు
- కొత్తగా 1,704 మంది దరఖాస్తు చేసుకుంటే సగం మందికి మొండి చేయి
- సభ్యత్వం లేక ప్రభుత్వ పథకాల నుంచి అందని లబ్ధి
- కొందరికే వాహనాలు, వలలు



పట్టిన చేపలకు టెండరు నిర్వహిస్తున్న మత్స్యకారులు(ఫైల్)

పాలమూరు, మే 21: మహబూబ్‌నగర్ జిల్లాలో మత్స్య సహకార సంఘాల్లో అధ్యక్షులు తమకు నచ్చిన, కావాల్సిన వారికే సభ్యత్వం ఇప్పిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వారు చెప్పిన వారికే సభ్యులుగా చోటు దక్కుతుందని కొత్తగా దర ఖాస్తు చేసుకున్న వారు వాపోతున్నారు. మరోవైపు చెరువుల్లో చేపలు పట్టేందుకు కాంట్రాక్టు తీసుకునే వారు చెప్పిన వారికీ సభ్యత్వం ఇస్తున్నారని అంటున్నారు. దాంతో నిజమైన అర్హు లకు అన్యాయం జరుగుతుందని చెబుతున్నారు. సంఘాల్లో ఇంటికి ఒకరికి సభ్యత్వం పొందే అవకాశం ఉంటుంది. సభ్యత్వం ఉంటేనే ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందుతారు. సభ్యత్వం లేనందున చాలా మంది పథకాల్లో లబ్ధి పొందడం లేదు. కొన్ని చోట్ల సంఘం మొత్తంలో అధ్యక్షుడికి మాత్రమే సబ్సిడీపై మోపెడ్ వాహనం రావటం గమనార్హం.

242 సంఘాలు

మహబూబ్‌నగర్ జిల్లాలో 20 మహిళా, 222 పురు షుల మత్స్య సహకార సంఘాలు ఉన్నాయి. మొత్తం 242 సంఘాలు ఉండగా.. మహిళా సభ్యులు 739 మంది, పురు ష సభ్యులు 11,543 మంది ఉన్నారు. జిల్లాలో వివిధ ప్రమా దాల కారణంగా మరణించిన 14 మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రూ.70 లక్షల ఎక్స్‌గ్రేషియా అందింది. కొత్త సభ్యత్వాల నమోదు కోసం రాష్ట్ర మత్స్యశాఖ డ్రైవ్ నిర్వహిస్తోం దని, జూన్ నాల్గో తేదీ వరకు ఎన్నికల కోడ్ ఉండటంతో ఆగిపో యిందని అధికారులు చెబుతున్నారు.

కొత్తగా 614 మందికే సభ్యత్వం

మత్స్య సహకార సంఘంలో సభ్యత్వం తీసుకోవాలంటే సభ్యుడికి 18 ఏళ్లు నిండి ఉండాలి. చెరువుల్లో వల విసరడం, లాగడం, ఈత కొట్టడం, తెప్ప వేయడం, వల అల్లడంలో ఏడాది పాటు అనుభవం ఉండాలి. ఏడాదిలో కొద్దికాలమే నీరు ఉండే చెరువుల ప్రాంతాల్లోని సభ్యులకు వల విసరడం, లాగడం, ఈత కొట్టడం వస్తే అధికారులు స్కిల్ టెస్టు నిర్వహి స్తారు. కొత్తగా 38 సొసైటీలు, 1,600 మంది సభ్యులు సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకోగా.. అధికారులు 29 సొసైటీల ప్రతిపా దనలను హెడ్ ఆఫీస్‌కు పంపించారు. అందులో 10 సొసై టీల(536 మంది సభ్యులు)కు అనుమతి లభించింది. 19 సొసై టీలను పెండింగ్‌లో పెట్టారు. మరో 11 సొసైటీల(104 మంది సభ్యులు)కు స్కిల్ టెస్టుపెట్టి హైదరాబాద్‌కు పంపగా, తొమ్మిదిం(78 మంది సభ్యులు)టికి అనుమతి వచ్చింది. రెండు సొసైటీలను పెండింగ్‌లో పెట్టారు.



రూ.5.31 కోట్ల ఆదాయం

మహబూబ్‌నగర్ జిల్లాలోని 17 మండలాల్లో చెరువులు, కుంటలు 1,091, ఒక రిజర్వా యర్ ఉన్నాయి. 2023-24 సంవత్సరంలో అందులో సుమారు కోటి రూపాయల ఖర్చుతో కోటీ 72 లక్షల చేప పిల్లలను వది లారు. తర్వాత 8,862 టన్నుల చేపలను మత్స్యకారులు పట్టు కుని అమ్ముకోవడంతో రూ.ఐదు కోట్లా 31 లక్షలా 72 వేల ఆదాయం సమకూరింది.

అందరికీ సబ్సిడీపై బైక్‌లు, వలలు ఇవ్వాలి



సంఘంలోని సభ్యులు, మత్స్యకార వృత్తిపై జీవించే వారికి ప్రభుత్వం సహకారం అందించాలి. సబ్సిడీపై బైక్‌లు, వలలు ఇచ్చే సమయంలో అందరికీ తెలిసేలా ప్రచారం చేయాలి. కేవలం కొంతమం దికే వాహనాలు, ఆటోలు, మోపెడ్‌లు ఇవ్వడం సరి కాదు. చెరువుల్లో కంప చెట్లు ఉండటంతో వలలు తెగిపోతున్నాయి. కొన్ని సందర్భాల్లో మత్సకారులు వాటిలో చిక్కుకొని చనిపోతున్నారు. అందుకే చెట్లను తొలగించాలి.

- గూల ఆంజనేయులు, మల్లారెడ్డిపల్లి, నవాబ్‌పేట మండలం

మార్కెట్లు ఏర్పాటు చేయాలి



చేపలు అమ్ముకునేందుకు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. మండల కేంద్రాల్లో, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పలు చోట్ల చేపల మార్కెట్లు ఏర్పాటు చేయాలి. అర్హులైన మత్స్యకా రులకు సబ్సిడీపై మోపెడ్లు, ఆటోలు ఇచ్చేటప్పుడు అందరికీ తెలుపాలి.

- వాకిటి రాజన్న, ధర్మాపూర్

కోడ్ ముగియగానే అందరికీ సభ్యత్వం



మహబూబ్‌నగర్ జిల్లాలో 1,704 మంది మత్స్యకారులు సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకు న్నారు. ఇప్పటికే స్కిల్ టెస్టు తోపాటు అన్ని రకాల పరిశీ లనలు పూర్తి చేశాం. ఎన్ని కల కోడ్ కారణంగా ఆగిపోయింది. జూన్ నాల్గో తేదీ అనంతరం అర్హులైన మత్స్యకారులకు సభ్యత్వం ఇస్తాం.

- డి.రాధారోహిణీ, జిల్లా మత్స్యశాఖ అధికారి

సాగు ప్రణాళిక రెడీ

- నాగర్‌కర్నూల్ జిల్లాలో 4.73 లక్షల ఎకరాల్లో సాగవనున్న పంటలు
- 9.26 లక్షల క్వింటాళ్ల విత్తనాలు.. 1.30 లక్షల టన్నుల ఎరువులు అవసరం
- జూన్ నాటికి సిద్ధం చేస్తామంటున్న అధికారులు



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

అచ్చంపేట, మే 21: నాగర్‌కర్నూల్ జిల్లాలో రైతులు సాగుకు సన్నద్ధమౌతున్నారు. ఈ నేప థ్యంలో వానాకాలం సాగు ప్రణాళికను అధికారులు ఖరారు చేశారు. జిల్లాలోని 20 మండలాల్లో 5,77,728 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గత ఏడాది 4,97,198 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. ఈ వానాకాలంలో 5,31,109 ఎకరాల్లో పంటలు వేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు. గతం కంటే ఈ ఏడాది 32,513 ఎకరాల్లో పంటలు అదనంగా వేయనున్నట్లు తెలిపారు. వాటి కోసం 9,26,80 క్వింటాళ్ల విత్తనాలు, 1,30,754 టన్నుల ఎరువులు అవసరం అవుతాయని గుర్తించారు. గత ఏడాది 57,824 మెట్రిక్ టన్నులు ఎరువులను వినియోగించారు. జూన్, జూలై నాటికి జిల్లాలో 23,569 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచుతామని వ్యవసాయశాఖ చెబుతోంది.

నకిలీ విత్తనాలపై నిఘా

జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాలపై అధికా రులు పోలీసు శాఖ సహకారంతో నిఘా ఉంచారు. జిల్లాలో ఎక్కువగా సాగయ్యే పత్తి విత్తనాలకు సంబంధించిన డీలర్లు అందుబాటులో ఉండేలా వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తు న్నారు. వరి, కందులు, జొన్నలు, మొక్కజొన్నలు, మినుములు తది తర పంటలకు సబ్సిడీపై ఎరువులు ఇవ్వనున్నారు.

జిల్లాలో గత ఏడాది సాగయిన, ఈ ఏడాది సాగు కానున్న పంటలు, విత్తనాల వివరాలు

పంట	2023లో సాగు	ఈ ఏడాది అంచనా	అవసరమయ్యే విత్తనాలు
	(ఎకరాల్లో)	(ఎకరాల్లో)	(క్వింటాళ్లలో)
పత్తి	235961	273720	855540
వరి	148513	140082	3502050
కందులు	3051	3755	11265
మొక్కజొన్న	48662	45237	1130925
జొన్న	2943	3442	13768
మినుములు	692	747	5.88
ఆముదం	82	294	59.76
వేరుశనగ	822	847	484.8
ఇతర పంటలు	521	5636	10.055



వ్యవసాయ పనిముట్లను తయారు చేస్తున్న వడ్రంగి

ఇసుక కోసం శ్మశాన వాటిక ధ్వంసం

- అడ్డుకోవడానికి వెళ్తే దాడులు
- వెంకటాంపల్లిలో కురువ సంఘం ఆందోళన



శ్మశాన వాటికలో ఇసుక డంప్ వద్ద ఆందోళన చేస్తున్న వెంకటాంపల్లి కురువ సంఘం నాయకులు

ఖిల్లాఘణపురం, మే 21: ఇసుక కోసం శ్మశానవాటికను ధ్వంసం చేయడం సరికాదని వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం వెంకటాంప ల్లిలో కురువ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. సంఘం నాయకులు కత్తె నరసింహ, రాజ మల్లయ్య, సిద్దె పర్వతాలు, బీరయ్య, బంగం బాలప్పతో కలిసి సభ్యులు గ్రామంలోని ఇసుక డంపుల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి సంబంధించి తిరుమలాయపల్లి శివారులో ప్రభుత్వ భూమిలో శ్మశాన వాటిక ఉందన్నారు. ఆ పొలంలో ఇసుక మేటలు ఉండటంతో వెంకటంపల్లి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఇసుకను తవ్వి, డంప్‌లు ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఇసుక కోసం సమాధులను ధ్వంసం చేయడంతో శవాల ఆనవాళ్లు బయట పడుతున్నాయని, అడ్డుకోడానికి ప్రయత్నిస్తే దాడులు చేసేందుకు వెనుకాడటం లేదని వాపోయారు. ఈ విషయమై అధికారులకు రాత పూర్వకంగా సమాచారం అందించినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశానవాటికలో ఇసుక తవ్వకుండా అడ్డుకో వాలని, ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు. ఈ విషయమై నయాబ్ తహసీల్దార్ పరమేష్‌ను వివరణ కోరగా ఇసుక తవ్వకాలపై రెండు వర్గాల ద్వారా ఫిర్యాదులు అందాయని, సర్వేయర్‌ను పంపి హద్దులు నిర్ణయిస్తా మని చెప్పారు. ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా ఇసుక తవ్వ కాలు చేపట్టిదని చెప్పారు.



నల్లమలలో గుర్తించిన ఎలుగు బంటి పాదముద్ర

శాకాహార జంతువుల గణన ప్రారంభం

మన్ననూర్, మే21: అమ్రాబాద్ పులుల అభ యారణ్యంలో శాకాహార జంతువుల గణనను అటవీ అధికారులు మంగళవారం ప్రారంభిం చారు. నేషనల్ కన్సర్వేషన్ అథారిటీ(ఎన్‌టీసీఏ) ఆదేశాల మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రా బాద్, మన్ననూరు, దోమలపెంట, మద్దిమడుగు రేంజ్‌ల పరిధిలోని అన్ని బీట్‌లలో శాకాహార జంతువులు సంచరిస్తున్న దృశ్యాలను చిత్రీకరిం చారు. రేంజ్ అధికారుల పర్యవేక్షణలో సెక్షన్, బీట్ అధికారుల నుంచి మొదలుకొని టైగర్ ప్రొటెక్షన్ వాచర్లు, టైగర్ సఫారీ డ్రైవరు, ఫైర్ వాచర్లు బృందాలుగా ఏర్పడి గణన చేపట్టారు. ఒక్కో బీట్‌లో ఇద్దరు అటవీ అధికారులు ఉదయం ఆరు గంటల నుంచి 10 గంటల దాకా, మళ్లీ సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల దాకా అడవిలో రెండు కిలో మీటర్లు నడుస్తూ అడవిలో సంచరిస్తూ కనిపించే జంతు వుల, పాదముద్రలు(ప్లగ్‌మార్కుల) ఫొటోలను మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తూ ఎన్‌టీసీఏకు అనుసంధానిస్తున్నారు. సర్వే చేస్తున్న ప్రాంతాల్లో రేంజ్ అధికారులు ఈశ్వర్, ఆదిత్య, గురుప్రసాద్, డీఆర్‌వో రవికుమార్, బయాలజిస్టు మహేందర్ పాల్గొన్నారు.



ఇటిక్యాల మండలం ఉదండాపురంలో విరిగిపోయిన విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్

విరిగిన చెట్లు.. కూలిన విద్యుత్ స్తంభాలు

- గద్వాల జిల్లాలో భారీ వర్షం
- పలు మండలాల్లో అంధకారం
- ఇటిక్యాల మండలం ఉదండాపురంలో ఎనిమిది గుడిసెలు పాక్షికంగా ధ్వంసం
- బోయలగూడెంలో పిడుగుపాటుకు ఎద్దు మృతి

గద్వాల/ ఇటిక్యాల/ గట్టు, మే 21: జోగుళాంబ గద్వాల జిల్లాలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దాంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో ఇటిక్యాల, అయిజ, రాజోలి, వడ్డేపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బోయలగూ డెంలో పిడుగుపాటుకు ఒక ఎద్దు మృతి చెందింది. గద్వాల-ఎర్రవల్లి ప్రధాన రహదారిపై అనంతాపురం స్టేజీ సమీపంలో భారీ చెట్టు విరిగి పడటంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలి చిపోయాయి. పోలీసులు అతికష్టం మీద దానిని తొలగింపజే శారు. ఇటిక్యాల మండలం ఉదండాపురంలో భారీ వృక్షాలతో పాటు చెట్ల కొమ్మలు విరిగిపోవడంతో ఎనిమిది గుడిసెలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. 20 విద్యుత్ స్తంభాలు నేలకొరి గాయి. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపో యింది. జములమ్మ స్టేజీ దగ్గర ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురవడంతో భక్తులు వేసిన షామియానాలు కొట్టుకుపోయాయి. అక్కడ భక్తులు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరుగ లేదు. గద్వాల మార్కెట్ యార్డుతో పాటు రోడ్ల వెంట పెద్ద చెట్లు విరిగిపోయాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. అయిజ పట్టణంలో కొన్ని కాలనీ ల్లోకి నీళ్లు వచ్చాయి. గట్టు మండలంలో మంగళవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురి సింది. ఈదురు గాలులకు మండలంలోని పలు గ్రామాల్లో పూరి గుడిసెలు దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల చెట్లు విరిగి పడ్డాయి. బోయలగూడెం గ్రామంలో రైతు కాంచన రంగ స్వామి పొలం వద్ద ఎద్దును కట్టేయగా, పిడుగు పడి మృతి చెందింది. ఆ గ్రామంలో పెద్ద చెట్టు కూలిపోయింది.



బోయలగూడెంలో పిడుగుపాటుకు మృతి చెందిన ఎద్దు వద్ద రోదిస్తున్న వృద్ధురాలు




బోయలగూడెంలో విరిగిపోయిన చెట్టు











ప్రతిభా వంతులైన విద్యార్థులను ప్రోత్సహించాలి


రెడ్‌క్రాస్ విద్యా నిధి నుంచి ఎంబీబీఎస్ విద్యార్థులకు చెక్కులను అందిస్తున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), మే 21 : ప్రతిభా వంతులైన విద్యార్థులను ప్రోత్సహించాలని కలెక్టర్ జి. రవినాయక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ విద్యా నిధి సహకారంతో గాంధీ, కాకతీయ ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్న సి.గోపి, ఎం.హరితలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున రెండు లక్షల రూపాయల చెక్కును కలెక్టర్ జి. రవినాయక్ అందజేశారు. నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి పేదరికం కారణంగా ఎంబీబీఎస్ విద్యను అభ్యసించలేని వారికి రెడ్ క్రాస్ విద్యానిధి ద్వారా ప్రతి సంవత్సరం విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. రెడ్‌క్రాస్ విద్యానిధి సహకారంతో మెడిసిన్ ద్వితీయ సంవత్సరంలో 71 శాతం మార్కులతో గోపిక, 65 శాతం మార్కులతో హరితలు ఉత్తీర్ణత సాధించారు. కలెక్టర్ ఇరువురు విద్యార్థునులను ప్రత్యేకంగా అభినందించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ విద్యానిధి నుంచి ఎంబీబీఎస్ చదువుతున్న నలుగురు విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ డాక్టర్ శామ్యూల్, కోశాధి కారి ఎస్. జగపతిరావు, ఎంసీ మెంబర్, యూత్ రెడ్ సమన్వయకర్త బాబుల్‌రెడ్డి, జూనియర్ రెడ్‌క్రాస్ సమన్వయకర్త అశ్వినిచంద్రశేఖర్, మేనేజర్ నరసింహ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం - కేసు నమోదు


తాడూరు, మే 21 : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని చెర్ల తిర్మలాపూర్ గ్రామానికి చెందిన మౌనిక(20) మంగళవారం తెల్లవారు జామున అదృశ్యమైనట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలం కుమ్మెర గ్రామానికి చెందిన మౌనికకు తల్లిదండ్రులు లేకపోవడంతో చెర్లతిర్మలాపూర్ గ్రామంలోని మేనమామ వద్ద ఉంటుంది. తెల్లవారుజామున 5గంటల నుంచి కనబడకపోవడంతో యువతి మేనమామ మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

13మంది పేకాటరాయుళ్ల అరెస్టు

మహబూబ్‌నగర్, మే 21: మహబూబ్‌నగర్ శివారు ప్రాంతంలోని మామిడితోటలో పేకాట ఆడుతున్న 13మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.34,220లు నగదు, ఎనిమిది ద్విచక్రవాహనాలు, మూడు ఆటోలు, ఒక జీపును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం మండలంలోని ధర్మాపూర్ శివారులో ఉన్న తోళ్లబండ గుట్ట ప్రాంతంలో డబ్బులు పెట్టి పేకాట ఆడుతున్నారనే సమాచారంతో రూరల్ సీఐ గాంధీనాయక్, మహమ్మదాబాద్ ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేసి పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. మరికొంతమంది పరారని సీఐ తెలిపారు.







సాగుకు సన్నద్ధం

- కృత్తిక , రోహిణీ కార్తుల్లో విత్తనాలు నాటితే మంచి దిగుబడులు వస్తాయని రైతులు ఆశాభావం


పొలంలో చెత్తను తొలగిస్తున్న రైతులు

భూత్పూర్, మే 21: రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. రెండు , మూడు రోజుల క్రితం భారీ వర్షం కురువటం..భూములు పదును కావడంతో రైతులు తమ పొలాలను సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా దుక్కి దున్నటంతో పాటు పొలాల్లో గతంలో సాగు చేసిన పంటల ఆనవాళ్లను తొలగిస్తున్నారు. 70ఏళ్ల తరువాత కృత్తిక, రోహిణీ కార్తులకు బలమొచ్చిందని, వెనుకటి కాలం మళ్లీ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ ఏటా ఖరీఫ్ పంటలను రైతులు జూన్ 16 నుంచి జూలై, ఆగస్టు చివరి వారం వరకు విత్తనాలను విత్తుకొనేవారు. అయితే అప్పట్లో పంటల దిగుబడి కూడా అంతంత మాత్రమే వచ్చేదని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ పంటల సాగులో మొదట్లో వర్షాలు కురిసినా మధ్యలో నెలల తరబడి వానాలు సరిగా కురువక పోవడంతో చాలా సార్లు రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. అయితే ఈ సారి వరుణుడు ముందుగానే కరుణించాడని చాలా మంది రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ వ్యవసాయ పనుల్లో తలమునకలైపోయారు. ప్రతి ఏటా జూన్ చివరి వారంలో లేదా జూలై మొదటి, రెండవ వారాల్లో వానాలు కురిసేవి. అంతవరకు చాలా మంది రైతులు ఎరువులు, విత్తనాలు, ఇతర వ్యవసాయ పనులను చక్కబెట్టుకొనేవారు. అయితే ఈ సారి సీను మారడంతో రైతులు ఆగమేఘాల మీదుగా వ్యవసాయ పనులను చక్కబెట్టుకుంటున్నారు. ముఖ్యంగా విత్తనాలు, ఏరువులు తీసుకొరావడంలో రైతులు బిజీ..బిజీగా ఉన్నారు. తొలకరి వర్షాలు ముందుగానే కురువడంతో పత్తి, జొన్నలు, మొక్కజొన్నలు, ఆముదాలు, ఇతర పంటలను వేయడానికి సన్నద్ధమవుతున్నారు. దేవరకద్ర నియోజవర్గంలోని ఐదు మండలాల్లో ఖరీఫ్‌లో 9,195 ఎకరాల్లో వరి, 3,880 ఎకరాల్లో జొన్నలు, 1295ఎకరాల్లో మొక్కజొన్నలు, 750 ఎకరాల్లో రాగులు, 1275 ఎకరాల్లో వేరుశనగ, 25,870 ఎకరాల్లో పత్తి, 1020ఎకరాల్లో కందులు పంటలను రైతులు సాగు చేసే అవకాశం ఉన్నట్లుగా అధికారులు అంచనా వేశారు. అయితే ఈ సారి పత్తి సాగు పెరిగే అవకాశం ఉన్నట్లుగా వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

కార్తుల్లో పంటలు వేసుకొనే అవకాశం



అదును అయితే మంచి కార్తుల్లో విత్తనాలు వేసుకోవచ్చు. నేను నా చిన్నతనంలో చూశాను. కుర్తిక, రోహిణీ కార్తుల్లో విత్తనాలు వేసుకుంటే మంచి దిగుబడులు వస్తాయి. ముఖ్యంగా జొన్నలు సాగు చేసుకుంటే మంచి దిగుబడి వస్తుంది. అన్ని పంటలకు మంచి అదును దొరుకుతుంది. నాకైతే చాలా సంతోషంగా ఉంది.

- లింగారెడ్డి, రైతు, మద్దిగట్ల

పొలాలను చదును చేసుకుంటున్నాం



ఇంత తొందరగా వానాకాలం వస్తదని అనుకోలేదు. పొలాలను చదును చేసుకుంటున్నాం. రోహిణీ కార్తెలో అదును అయితే మంచిదే. వెనుకటికి రోహిణీ కార్తెలో జొన్నలు వేసుకొనేవారం. అప్పుడు పంటలు బాగా పండేవి. ఈ సారి వానాకాలం ముందుగానే అయితున్నట్లుంది. అన్ని పంటలకు మంచి గుంటది. పెట్టుబడులకు ఇబ్బందిగానే ఉంది.

- బూనెమోని చిన్నప్ప, రైతు, గాజులపేట



దామరగిద్ద వాసికి బంగారు పతకం



పరుగు పందెంలో బంగారు పతకాన్ని సాధించిన ఉదరి శ్రీకాంత్

దామరగిద్ద, మే 21: ఢిల్లీలో ఫిట్ ఇండియా ఫెడరేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో పరుగు పందెం పోటీల్లో దామరగిద్ద వాసి బంగారు పతకాన్ని సాధించాడు. నారాయణపేట జిల్లా దామరగిద్ద గ్రామానికి చెందిన ఉదరి అశోక్, ఉదరి గోవిందమ్మ దంపతుల కుమారుడు ఉదరి శ్రీకాంత్ పదవ తరగతి వరకు దామరగిద్ద ఉన్నత పాఠశాలలో చదివాడు. ఇంటర్మీడియట్ నారాయణపేటలోని ఓ జూనియర్ కళాశాలలో పూర్తి చేశాడు. ఇటీవల వరంగల్‌లో అగ్నివీర్ డిఫెన్స్ అకాడమీలో ఆర్మీకి శిక్షణ పొందుతున్నాడు. ఈనెల 18 నుంచి 21 వరకు ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి పరుగు పందెం పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-19 విభాగం 400 మీటర్ల పరుగుపందెంలో శ్రీకాంత్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించి తన ఊరును యావత్ భారతదేశానికి పరిచయం చేశాడు. జూన్ 20 నుంచి 25 వరకు జరగనున్న అంతర్జాతీయ స్థాయి పరుగుపందెం పోటీలకు సెలెక్ట్ అయ్యాడు. శ్రీకాంత్‌ను కుటుంబ సభ్యులు, మిత్రులు, దామరగిద్ద గ్రామవాసులు అభినందించారు.

జానంపేట శివారులో 15 కుక్కలు మృతి



మృతి చెందిన కుక్కలు

అడ్డాకుల, మే 21: మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం జానంపేట వద్దగల 44వ జాతీయ రహదారికి సమీపంలో 15 వీధి కుక్కలు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు ఇచ్చిన సమాచారం ప్రకారం.. మూసాపేట ఎస్ఐ సుజాత, తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన కుక్కలను పరిశీలించారు. ఎవరైనా విషమిచ్చి చంపేశారా, లేదా ఎక్కడినుంచైనా తీసుకువచ్చి పడేశారా అనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. ఈ సందర్భంగా మూసాపేట పశువైద్యాధికారి రాజేశ్‌ఖన్నా పంచనామా చేసి శాంపిల్స్‌ను సేకరించారు. ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించి కుక్కల మృతికి కారణాలను తెలుసుకోనున్నట్లు తెలిపారు. కొన్ని నెలల క్రితం అడ్డాకుల మండల పరిధిలోని పొన్నకల్‌లో కూడా వీధి కుక్కలను చంపిన సంఘటన మరువకముందే మరోసారి ఇలా వీధికుక్కలు చనిపోవడంతో చర్చనీయాంశంగా మారింది. మూగ జీవాలను చంపిన వారిని కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న టెట్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మే 21 : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రెండవ రోజు మంగళవారం ప్రశాంతంగా కొనసాగింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జేపీఎన్‌సీఈ, క్రిస్టియన్‌పల్లిలో గల ఫాతిమా విద్యాలయంలో పరీక్ష ఉదయం , మధ్యాహ్నం నిర్వహించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే రావడంతో సందడిగా కపించింది. మధ్యాహ్నం 2 నుంచి నిర్వహించిన పరీక్షకు 185 మంది గాను 168 మంది హాజరు కాగా 17 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

24న పాలిసెట్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మే 21 : పాలిటెక్నిక్‌లో వివిధ కోర్సుల ప్రవేశాల కోసం ఈ నెల 24న నిర్వహించనున్న పాలిసెట్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపాల్, పరీక్షల కన్వీనర్ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24న ఎదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు గాను ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్ష హాల్‌లోకి అనుమతి లేదని తెలిపారు. జిల్లా ఐదు కేంద్రాలలో మొత్తం 3,332 మంది విద్యార్థులు పరీక్షకు హాజరకానున్నట్లు తెలిపారు.

నేడు ఎకో పార్క్‌లో స్నేక్ షో

మహబూబ్ నగర్ (కలెక్టరేట్), మే 21: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మయూరి ఎకో పార్క్‌లో బుధవారం సాయంత్రం 5 గంటలకు అంతర్జాతీయ జీవ వైవిధ్యం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు అటవీ శాఖ జిల్లా అధికారి సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్నేక్ షో ఉంటుందన్నారు. సందర్శకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.


కారు డ్రైవర్‌పై కేసు నమోదు

ఊర్కొండ, మే 21: మండల కేంద్రంలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై గత వారం కారు ఢీ కొన్న ఘటనలో మంగళవారం కేసు నమో దు చేసినట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బొమ్మరాజు పల్లి గ్రామానికి చెందిన యెన్నం నాగార్జున రెడ్డి జడ్చర్ల వెళ్లి పనులు ముగించుకొని ఊర్కొండ గేటు వద్ద బస్సు దిగి రోడ్డు దాటుతున్న క్రమంలో కల్వకుర్తి నుంచి జడ్చర్ల వెళ్తున్న కారు ఢీ కొట్టింది. దాంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మంగళవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కారు నడుపుతున్న వ్యక్తి జడ్చర్లకు చెందిన నరసింహాచారిగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

బాలానగర్, మే 21: మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం మోతిఘనపూర్ గ్రామంలో నవదుర్గ అనే ఇనుప సామాను తయారీ పరిశ్రమలో ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై తిరుపాజీ వెల్లడించారు. ఫరూక్‌నగర్ మండలంలోని మదలాపూర్ గ్రామానికి చెందిన జంగయ్య అనే వ్యక్తి పరిశ్రమలోని ప్రహరీ కూలిపోయి జంగయ్యపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. భార్య సుమతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెక్‌డ్యామ్ ధ్వంసం



బొమ్మరాజుపల్లిలో ఉపాధి కూలీలు ధ్వంసం చేసిన చెక్ డ్యామ్

ఊర్కొండ, మే 21 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కంటే ముందు మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం డార్క్ ఏరియాగా పిలువబడేది. భూగర్భజలాలు అడుగంటి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. దాంతో అప్పటి పాలకులు డార్క్ ఏరియాగా గుర్తించి భూగర్భజలాలు పెంపొందించేందుకు నీరు నిల్వ ఉంచే క్రమంలో చెక్ డ్యామ్‌లు, ఊటకుంటల నిర్మాణం చేపట్టారు. అందులో భాగంగానే నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం బొమ్మరాజుపల్లి గ్రామంలో పదిహేను సంవత్సరాల క్రితం ఆ గ్రామ శివారులోని రైతు వ్యవసాయ భూమిలో సుమారు రూ.10 లక్షలతో చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టారు. భూముల విలువలు పెరగడంతో రైతు చెక్‌డ్యామ్ ధ్వంసం చేయడానికి పూనుకున్నారు. దాంతో ఉపాధి హామీ పథకంలో భూమి చదును పేర నిధులు మంజూరు చేయించుకొని ఉపాధి హామీ కూలీలతో చెక్‌డ్యామ్ కూల్చి చదును చేశారు. ప్రభుత్వ అధికారులకు తెలిసి జరిగిందా, తెలియకుండా జరిగినా ప్రభుత్వ ఆస్తులను ప్రభుత్వ పథకంలోనే తీసివేయడంపై పరిసర ప్రాంత రైతులు అధికారుల తీరుపై విమర్శిస్తున్నారు. చెక్‌డ్యామ్ ధ్వంసం చేయడంతో పరిసర ప్రాంత భూములు వర్షాలకు కోతకు గురి కావడంతో పాటు భూగర్భజలాలు అడుగంటుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసం చేసిన వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

దినదిన గండం

- ఆందోళనలో చిన్నోనిపల్లి ముంపు గ్రామస్థులు
- వర్షాకాలం ఆరంభానికి ముందే రిజర్వాయర్‌లోకి చేరిన నీరు
- వర్షాలు ఇలానే కురిస్తే గ్రామానికి తప్పని జల ముప్పు
- పునరావాస కేంద్రంలో మౌలిక సదుపాయాలు నిల్



చిన్నోనిపల్లి రిజర్వాయర్‌లోకి చేరిన నీరు

గట్టు, మే 21 : నెట్టంపాడు ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురి అయిన గద్వాల జిల్లా గట్టు మండలం చిన్నోనిపల్లి నిర్వాసితుల జీనం దినదిన గండంగా మారింది. కురిసిన వర్షాలకు రిజర్వాయర్‌లో ఇప్పటికే భారీగా నీరు చేరడంతో గ్రామస్థులు ఆందోళనలో పడ్డారు. ఈ వర్షాకాలంలోనూ గ్రామానికి ముంపు కష్టాలు తప్పేటట్లు లేవు. మూడు రోజుల క్రితం కురిసిన వర్షాల మాదిరిగా మరో రెండు వర్షాలు కురిస్తే గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకోక తప్పదు. మరి ఈ పరిస్థితుల్లో గ్రామస్థులు మేల్కొని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటారా? లేక అధికారులతో మాట్లాడి రిజర్వాయర్‌లోని నీటిని దిగువకు వదిలేలా ఒత్తిడి తెస్తారా చూడాలి. 101ప్యాకేజీ రిజర్వాయర్‌లో ఈ గ్రామం ముంపునకు గురి కావడంతో 2006 అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ముంపు గ్రామంగా ప్రకటించింది. దీంతో గ్రామంలోని 251 ఇళ్లు ముంపునకు గురవుతున్నట్లు జీవోను విడుదల చేసింది. ఆనాటి నుంచి గ్రామ ప్రభుత్వ రికార్డుల్లో ముంపు గ్రామంగా నమోదు అయింది. అయితే ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో రిజర్వాయర్‌కు ఇరువైపులా ఉన్న రెండు పెద్ద వాగుల ద్వారా నీరు భారీగా రిజర్వాయర్‌లోకి చేరుతున్నది. ఇది వరకు కట్టదగ్గర గల వాగులు పారే ప్రాంతం మధ్యలో రిజర్వాయర్ మట్టి కట్టను నిర్మాణం చేపట్టకుండా వదలివేయడంతో వాగుల ద్వారా వస్తున్న నీరంతా దిగువకు పారుతుండటంతో రిజర్వాయర్‌లో నీరు స్టోరేజీకి ఆస్కారం ఉండేది కాదు. కానీ, ప్రస్తుతం నిర్మాణం చేపట్టకుండా వదలివేసిన రిజర్వాయర్ కట్ట దగ్గర గల గండిని కాంట్రాక్టర్ గతేడాది నుంచి నిర్మాణం చేపట్టడంతో నీరు దిగువకు వెళ్లే వీలు లేకుండా రిజర్వాయర్‌లోనే నిల్చిపోతున్నవి. ఇలా నిల్వ ఉంటున్న నీటితో గ్రామానికి జల ముప్పు పొంచి ఉన్నది. వర్షాకాలం ప్రారంభం కాకముందే ఇలా రిజర్వాయర్‌లోకి భారీగా నీరు చేరడంతో నీరంతా బ్యాక్ వస్తుండటంతో ముంపు గ్రామస్థులు దిగులు చెందుతున్నారు. గ్రామాన్ని ఖాళీ చేసి పోదామంటే పునరావాస కేంద్రంలో మౌలిక సదుపాయలను గత ప్రభుత్వం కల్పించకపోవడంతో ఇప్పటికిప్పుడు ఖాళీ చేయడం సాధ్యం కాదని గ్రామస్థులు అంటున్నారు. దీంతో చిన్నోనిపల్లి వాసుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి మాదిరిగా తయారైంది. పునరావాస కేంద్రంలో ప్రజలకు కల్పించాల్సిన ముంపు ప్యాకేజీ, వసతులతో పాటు ఇచ్చిన హామీలను అమలు చేయాలని గ్రామస్థులు గత ప్రభుత్వ పెద్దలతో పాటు స్థానిక నాయకులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో చిన్నోనిపల్లి వాసులకు ముంపు కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం ఏర్పాటు అయిన కొత్త ప్రభుత్వం ఆదుకుంటుందన్న ఆశతో ప్రజలు ఎదురు చూస్తున్నారు.

పిల్లర్లకే పరిమితం

ముంపు గ్రామాన్ని కొత్తగా నిర్మించడానికి యర్రగట్టు ప్రాంతంలో దాదాపు 40 ఎకరాల ప్రభుత్వ భూములతో పాటు కొంతపట్టా భూములను సేకరించి లేఅవుట్ వేసి 360మందికి పట్టాలు అందజేశారు. కానీ, గ్రామస్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో గ్రామస్థులు పునరావాస కేంద్రానికి వెళ్లడానికి విముఖత వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భవనాలు, తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం, రోడ్లు, డ్రైనేజీ వంటి వసతులు పూర్తిస్థాయిలో కల్పించలేదు. వీటితో పాటు పునరావాస ప్రజలకు అందాల్సిన ప్యాకేజీ కల్పనలో ప్రభుత్వం చొరవ చూపక పోవడంతో గ్రామస్థులు అక్కడికి వెళ్లడానికి ముందుకు రాలేదు. గత 17 సంవత్సరాల క్రితం నిర్మించిన డ్రైనేజీలు, రోడ్లు, తాగునీటి ట్యాంకు శిథిలావస్థకు చేరాయి. ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ భవనం పిల్లర్ల వరకే నిర్మించి మధ్యలో వదలి వేశారు. షిఫ్టింగ్ చార్జీల కోసం 300మంది సీ ఫామ్స్ అందజేయగా ఇంకా 70 మందికి అమౌంట్ అందలేదు. మిగతా 63 మందివి సీ ఫామ్స్ తీసుకోలేదు. వీటితో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కావాలని ముంపు ప్రజల డిమాండ్ చేస్తున్నారు.



చిన్నోనిపల్లి పునరావాస కేంద్రంలో 15 ఏళ్లగా పిల్లర్లకే పరిమితమైన పాఠశాల భవన నిర్మాణం

రిజర్వాయర్ రద్దు చేయాలి



చిన్నోనిపల్లి రిజర్వాయర్ కింద ఆయకట్టు లేదు.ఈ రిజర్వాయర్ వల్ల 2400 ఎకరాల సాగు భూములు కోల్పోయాము. ఐదు గ్రామాల ప్రజలు భూ నిర్వాసితులు అయ్యాము. బతుకు దెరువు కష్టంగా మారింది. రిజర్వాయర్ పనులు చేపట్టొద్దని అప్పటి ప్రభుత్వ పెద్దలకు విన్నవించాము. కానీ, పోలీసుల పహారాలో పనులు చేపట్టారు. నిర్వాసితులను అరెస్టు చేశారు. కురిసిన వర్షంతో ప్రస్తుతం రిజర్వాయర్‌లోకి వాగుల ద్వారా నీరు చేరడంతో ఆందోళనలో పడ్డాం. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలి.

- రామచంద్ర, చిన్నోనిపల్లి పునరావాస కమిటీ సభ్యులు

చిన్నోనిపల్లి అంశాన్ని పరిశీలిస్తాం



ఇన్ని రోజులు ఎన్నికల బీజీలో ఉన్నందున పునరావాస కేంద్రాలపై దృష్టి సారించలేదు. చిన్నోనిపల్లి గ్రామస్థులతో చర్చించిన అనంతరం ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఉన్నతాధికారులతో మాట్లాడుతాము. పునరావాస ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందించే అన్ని రకాల పరిహారాలు అందజేయడానికి చర్యలు తీసుకుంటాం.

- రామచంద్రుడు, ఆర్డీవో, గద్వాల

మార్కెటింగ్ సమస్యను అధిగమించాలి

- శాస్త్రవేత్తలు ప్రణాళికలు రూపొందించాలి
- తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ పి.రఘురామిరెడ్డి

రాజేంద్రనగర్, మే21(ఆంధ్రజ్యోతి) : తమ వ్యవసాయ ఉత్పత్తులను సరైన సమయంలో సరైన విధంగా మార్కెట్‌లో అమ్ముకోవడం అనేది రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సవాల్ అని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.రఘురామిరెడ్డి అన్నారు. ఇతర పరిశ్రమలలో అధిక ఉత్పత్తులు చేసినప్పుడు బోనస్ లభిస్తుందని, కానీ వ్యవసాయ రంగంలో ఒక్కో సారి అధిక ఉత్పత్తి కారణంగా పెనాల్టీలు, నష్టాలు భరించాల్సి రావడం దురదృష్టకరమని ఆయన అభిప్రాయపడ్డారు. రాజేంద్రనగర్ లోని విస్తరణ విద్యాసంస్థలో రెండు రోజుల పాటు జ రుగనున్న అమ్మకందారులు, కొనుగోలుదారుల సదస్సు మంగళవారం ప్రారంభమైంది. నాబార్డు సహకారంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పది రైతు ఉత్పత్తిదారుల సంఘాల రైతులు సదస్సులో పాల్గొన్నారు. ఈ సదస్సులో పి.రఘురామిరెడ్డి మాట్లాడుతూ త్వరగా పాడయిపోయే టమాటలు, పూలు, కూరగాయాలు వంటి ఉత్పత్తుల మార్కెటింగ్ జఠిలమైన సమస్య అని ఆయన అన్నారు. మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి ఆధునాతన టెక్నాలజీలు వినియోగించి ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి ఎఫ్‌పీఓలు వ్యవసాయంలో ఇతర రైతులకు ఆదర్శంగా నిలవాలన్నారు. భవిష్యత్‌లో ఎఫ్‌పీఓలు చాలా కీలక పాత్ర పోషించనున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. వ్యవసాయ ఉత్పత్తులను ఎక్కడ పండించారు. ఎరువులు పురుగుల మందులను ఏ మేరకు వినియోగించారన్న అంశంపై నేడు వినియోగదారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని రైతులు ఈ విషయాన్ని గమనించాలని రఘురామిరెడ్డి సూచించారు. వ్యవసాయ ఉత్పత్తుల్లో నాణ్యత, వైవిధ్యం, స్వచ్ఛతలకి ప్రాధాన్యమిస్తే మార్కెట్ చేసుకోవడం సులువు అవుతుందని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సంచాలకులు జి.లక్ష్మీబాయి అన్నారు. తమ శాఖ పరంగా రైతులకు వీలున్నంత వరకు సేవలు అందిస్తున్నామన్నారు. రైతులు తమ ఉత్పత్తులు శుభ్రం చేయడం, గ్రేడింగ్ చేయడం, ఎండబెట్టడం వంటి అంశాలపైన ప్రత్యేక దృష్టి పెడితే మంచి ధర లభిస్తుందన్నారు. కొన్ని వ్యవసాయ ఉత్పత్తులను ఆరు నెలల పాటు తమ శాఖ గిడ్డంగులలో నిల్వ చేసుకోవడానికి కూడా ఒక పథకం అమలు చేస్తున్నట్లు లక్ష్మీబాయి వివరించారు. సమావేశంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ అగ్రి కల్చర్ డాక్టర్ సీమ, ఉన్నతాధికారులు డాక్టర్ వి.సు ధారాణి, జాతీయ వరి పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షీ సుందరం, విస్తరణ విద్యా సంస్థ డైరె క్టర్ డాక్టర్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, నాబార్డ్ ప్రతినిధి ఎం. వినయ్‌కుమార్, ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ మధుబాబు, రైతులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

-కేసు నమోదు

కల్వకుర్తి, మే 21 : కల్వకుర్తిలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ మాధవ రెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. వంగూరు మండలం మిట్టసదగోడుకు చెందిన శేఖర్ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను ట్రాక్టర్ ద్వారా తరలిస్తుండగా కల్వకుర్తిలో పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య



చంద్రయ్య

ఉప్పునుంతల, మే 21: అనారోగ్య కారణాలతో మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్‌జిల్లా ఉప్పునుంతలలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంధం చంద్రయ్య (70) మూడు నెలల క్రితమే భార్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. దానికి తోడు అనారోగ్య సమస్యలు వేధించేవి. ఉదయం కుమారుడు పొలానికి వెళ్లిపోయిన తరువాత ఇంట్లో ఎవరు లేకపోవడంతో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటి పక్క వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నట్లు తెలిపారు.

చొప్ప మిషన్‌లో పడి చేతికి గాయాలు



చికిత్స పొందుతున్న గోపాల్‌నాయక్

మిడ్జిల్, మే 21: చొప్ప మిషన్‌లో ప్రమాదవశాత్తు చేయి పట్టడంతో రైతు కూడి చేతి రెండు వేళ్లకు గాయాలు అయ్యాయి. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని మంగళిగడ్డ గ్రామ పంచాయతీ మంగళవారం చోటు చేసుకున్నది. తుల్జానాయక్‌తండాకు చెందిన గోపాల్‌నాయక్ తన పొలం వద్ద చొప్ప కత్తిరిస్తుండగా ప్రమాదవశాత్తు చేయి మిషన్‌లో పడటంతో కూడి చేతి రెండు వేళ్లకు గాయాలు అయ్యాయి. గాయపడిన గోపాల్‌నాయక్‌ను వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గాయపడిన పాడి రైతు గోపాల్‌నాయక్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని పాడిరైతులు కోరారు.


విద్యుదాఘాతానికి గేదెలు మృతి

అచ్చంపేటటౌన్, మే 21: ప్రమాదవశాత్తు వేర్వేరు చోట్ల జరిగిన విద్యుదాఘాతానికి ఐదు గేదెలు మంగళవారం మృతి చెందాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట పట్టణానికి చెందిన బెల్లి అంజనమ్మకు చెందిన గేదెలను ఇంటి దగ్గర నుంచి పొలానికి తీసుకెళ్తుండగా చౌటపల్లి రోడ్డు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదె విలువ రూ. 60వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరింది.

షికారుగానిపల్లిలో..

మిడ్జిల్: జడ్చర్ల మండలంలోని షికారుగానిపల్లిలో మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం విరిగి రైతు రాములుకు చెందిన గేదెలుపై పడటంతో నాలుగు గేదెలు మృతి చెందాయి. విషయం తెలుసుకున్న జడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య సంఘటన స్థలానికి చేరుకొని రాములు కుమారుడు మధుతో పాటు కుటుంబసభ్యులను పరామర్శించారు. అక్కడి నుంచే ఫోన్‌లో విద్యుత్ అధికారులతో మాట్లాడి రైతు కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని కోరినట్లు స్థానికులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని నెమలి మృతి



మృతి చెందిన నెమలి

కోస్గిరూరల్, మే21: గుర్తు తెలియని వాహనం ఢీకొని నెమలి మృతి చెందిన సంఘటన కోస్గిలో చోటుచేసుకుంది. మంగళవారం పట్టణశివారులోని శాంతినికేతన్ పాఠశాల సమీపంలో సర్జాఖాన్‌పేట వెళ్లే రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొని నెమలి మృతిచెందింది అధికారులు పట్టించుకోకపోవడంతో అటుగా వెళ్తున్నవారు రోడ్డు పక్కకు నెమలిని తోశారు. జాతీయ పక్షి మృతి చెందిన అధికారులు పట్టించుకోకపోవడంపై బాటసారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాంకేతిక విద్య వైపు మొగ్గు

- ఐటీఐకి పెరుగుతున్న ఆదరణ
- కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- వచ్చేనెల 10వరకు గడువు




వనపర్తి ప్రభుత్వ ఐటీఐ కళాశాల

వనపర్తి రూరల్, మే 21: ఉపాధి అవకాశాలు విస్తృతం, పైగా స్వల్పకాలిక కోర్సు, తక్కువ ఖర్చుతో కూడుకున్న విద్య కావడంతో విద్యార్థులు సాంకేతిక విద్య వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో చాలా మంది విద్యార్థులు పదవ తరగతి పాస్ అయిన వెంటనే ఇంటర్మీడియట్, డిగ్రీ చదివేవారు. కొందరు విద్యార్థులు చదువును మధ్యలో వదిలేసి, వ్యాపారాలు, తదితర పనులు చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తారు. కానీ ఇటీవల విద్యార్థులు ఐటీఐ వైపు మొగ్గు చూపుతున్నారు.

ఈ క్రమంలో ప్రభుత్వ పారిశ్రామిక సాంకేతిక శిక్షణ సంస్థ కళాశాలల్లో ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సాంకేతిక విద్య కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 10వరకు గడువు ఉంది. వనపర్తి జిల్లా పరిధిలో ఒక ప్రభుత్వ, మూడు ప్రైవేటు ఐటీఐ కళాశాలలు ఉన్నాయి. వనపర్తి పట్టణ పరిధిలోని రాజపేట శివారులో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఉంది. అలాగే చిట్యాల శివారులో ప్రగతి ఐటీఐ కళాశాల, కొత్తకోటలో వెంకటేశ్వర ఐటీఐ కళాశాల, నందిమల్లలో ప్రియదర్శిని ఐటీఐ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో ప్రవేశాలకు సాంకేతిక విద్యాశాఖ అధికారులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఎలక్ట్రిషన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మాన్, వెల్డర్, సివిల్, కంప్యూటర్ అండ్ ప్రోగ్రాం కోర్సులు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు పదో తరగతి గ్రేడింగ్ ఆధారంగా సీట్లు కేటాయింపు ఉంటుంది. దరఖాస్తు చేసుకోవడానికి ఐటీఐ తెలంగాణ గవర్నమెంట్ ఇన్ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వాలి. కుడివైపు విద్యార్థి లాగిన్‌ను ఓపెన్ చేయాలి. కొత్త రిజిస్ట్రేషన్ ఎంచుకుని సెల్‌ఫోన్ నంబర్ మెయిల్ ఐడిని నమోదు చేసి సబ్మిట్ చేయాలి. సెల్‌ఫోన్‌కి యూజర్ నేమ్ పాస్‌వర్డ్ వస్తుంది. వాటి ఆధారంగా విద్యార్థి వివరాలను నమోదు చేయడంతో పాటు పదవ తరగతి ధ్రువపత్రం, ఇతర పత్రాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. తక్కువ ఖర్చుతో రెండు సంవత్సరాల ఐటీఐ కోర్సు చేసి, అప్రెంటిస్ చేస్తే స్వయం ఉపాధి పొందడంతో పాటు వివిధ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు, ప్రభుత్వ ఉద్యోగాలు పొందుతుండటంతో చాలా మంది విద్యార్థులు చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు క్యూ కడుతున్నారు.

ఉద్యోగ అవకాశాలు ఎక్కువ



ఐటీఐ చేయడం వల్ల ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేటు ఉద్యోగాల్లో చేరవచ్చు. చాలా మంది విద్యార్థులు ఇతరాత్ర ప్రైవేటు కంపెనీల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లోకి వెళ్లారు. ఆసక్తికరమైన విద్యార్థులు ఎవరైనా ఉంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

- ఐక్కన్న, ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఐటీఐ కళాశాల

గ్రామీణ దేవతలను ఆరాధిద్దాం

» కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, మే 21 : గ్రామ దేవతలను పూజిస్తే గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. దైవ కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాల్గొంచుకోవాలని ఆయన సూచించారు. కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలోని ఎల్లమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారి కల్యాణం మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, నాయకుడు కశిరెడ్డి వెంకట్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జిల్లెల రాములు, విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులున్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

» అదనపు కలెక్టర్ కె.సీతారామారావు



కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నాగర్‌కర్నూల్ టౌన్, మే 21 : ఈనెల 21 నుంచి జూన్ 3 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.సీతారామారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 6,548 మంది విద్యార్థులు హాజరు కానుండగా అందులో మొదటి సంవత్సరం 4,037 మంది, ద్వితీయ సంవత్సరం 2,511 మంది ఉన్నారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 21 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఇంటర్ విద్యా నోడల్ అధికారి జి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు తప్పనిసరిగా లక్ష్యాన్ని ఏర్పర్చుకోవాలి

» అడిషనల్ ఎస్పీ సీహెచ్.రామేశ్వర్



పోలీస్ వ్యవస్థ పనితీరు గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఏఎస్పీ

నాగర్‌కర్నూల్ క్రైం, మే 21 : విద్యార్థులు తప్పనిసరిగా లక్ష్యాన్ని ఏర్పర్చుకోవాలని జిల్లా అడిషనల్ ఎస్పీ సీహెచ్.రామేశ్వర్ సూచించారు. జిల్లా కేంద్రంలోని సీఎస్ఆర్ మెమోరియల్ స్కూల్లో మంగళవారం షీ టీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌కు ఏఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 30మంది విద్యార్థులకు రామేశ్వర్ పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా లక్ష్యాన్ని ఏర్పర్చుకోవాలని, బాలికల పట్ల దురుసుగా ప్రవర్తించినా, ఇబ్బంది పెట్టినా షీటీమ్ ద్వారా కేసులు నమోదై భవిష్యత్‌లో లక్ష్యాన్ని కోల్పోతారని వివరించారు. అనంతరం వారినందరినీ నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీస్ వ్యవస్థపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎస్సై గోవర్ధన్, షీటీమ్ ఏఎస్సై విజయలక్ష్మీ, షీటీమ్ సభ్యుడు వెంకటయ్యతో పాటు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించిన ట్రైనీ ఏఎస్‌వోలు



బిజినేపల్లిలోని తహసిల్‌లో కార్యాలయ సేవలను ట్రైనీ ఏఎస్‌వోలకు వివరిస్తున్న తహసీల్దార్ శ్రీరాములు

బిజినేపల్లి/తాడూరు/తెలకపల్లి, మే 21 : స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నుంచి ఎంపికైన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్(ఏఎస్‌వో) శిక్షణలో భాగంగా మంగళవారం బిజినేపల్లి, తాడూరు మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. ఎంపీడీవో, తహసీల్దార్, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రజలకందుతున్న సేవలను ఏఎస్‌వోలు దీక్షాంత్, రవీందర్, సోనీ, దర్శన్, సత్యేంద్రలు పరిశీలించారు. బిజినేపల్లి తహసీల్‌లో తహసీల్దార్ శ్రీరాములు, ఎంపీడీవో కతలప్ప, పంచాయతీ కార్యదర్శి మహేష్‌నాయక్ ఏఎస్‌వోలకు ఆయా కార్యాలయాల్లో ప్రభుత్వ అధికారుల విధులు, సేవలను వివరించారు. అదేవిధంగా తాడూరు మండలం అల్లాపూర్‌లో ఏఎస్‌వోలు ఐదుగురు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎంపీడీవో జ్యోతిపరోషియా, ఎంపీవో లక్ష్మణ్‌నాయక్, ఏఈవో, పంచాయతీ కార్యదర్శి ఏఎస్‌వోలకు స్వాగతం పలికారు. తెలకపల్లిలో ఆరుగురితో కూడిన ఏఎస్‌వోల బృందం మంగళవారం విద్య, వైద్య, వ్యవసాయ, పంచాయతీరాజ్, ఈజీఎస్, పోలీస్, ఆబ్కారీ, బీసీ గురుకుల పాఠశాల, హాస్టల్, కేజీబీవీ, లైబ్రరీ అధికారులను వారివారి కార్యాలయాల వద్ద కలిసి శాఖాపరమైన పథకాల అమలు, పనితీరు, నిధులు, ఆదాయ, వ్యయాలు, సంక్షేమ పథకాల అమలు, లోటుపాట్ల గురించి తెలుసుకున్నారు. ఎంపీడీవో కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి కేవీ.భాస్కర్, నజీర్, ఖాసీమ్, ఫర్హానా తదితరులు వారి వెంట ఉన్నారు.

నర్సరీలో మొక్కల పెంపకాన్ని పరిశీలించిన ఎంపీడీవో

అమ్రాబాద్, మే 21 : మండలంలోని బీకే ఉప్పునుంతల గ్రామ నర్సరీలో ఎంపీడీవో మోహన్‌లాల్ మంగళవారం మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. త్వరలో జరగనున్న హరితహారం కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకొని లక్ష్యానికనుగుణంగా మొక్కల పెంపకాన్ని చేపట్టాలని సంబంధిత అధికారులను ఎంపీడీవో ఆదేశించారు. అనంతరం ఉపాధి హామీ పనులకు సంబంధించిన రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఉద్యానవన మొక్కలను పెంచుకునే వారి వివరాలను సేకరించాలని సూచించారు. ఎంపీడీవో వెంట ఈజీఎస్ ఈసీ రేనయ్య, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

జన్‌మన్ రెగా ఆప్‌లో ఉపాధి హామీ సమాచారం

మన్ననూర్, మే 21 : ఉపాధి హామీ పథకం, కూలీల పనిదినాలు, చెల్లింపుల సమాచారం జన్‌మన్ రెగా యాప్‌లో అందుబాటులో ఉంటుందని, కూలీలు ఈ యాప్ ద్వారా సమాచారాన్ని తెలుసుకోవచ్చని ఉపాధి హామీ ఏపీవో రఘు తెలిపారు. అమ్రాబాద్ మండలం మన్ననూరులోని నర్సరీని మంగళవారం ఆయన పరిశీలించారు. వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో మొక్కలను సిద్ధం చేయాలని కోరారు. అనంతరం మన్ననూరులోని ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. రోజ్‌గార్ దివస్‌లో భాగంగా పేస్లిప్‌లు, జాబ్‌కార్డు అప్‌డేట్ చేసే విషయమై ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, క్షేత్ర సహాయకుడు కృష్ణనాయక్ ఉన్నారు.

కార్యకర్తలను పరామర్శించిన ఎల్లేని

పెద్దకొత్తపల్లి, మే 21 : మండల పరిధిలోని చిన్నకార్పాముల గ్రామంలో కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయపడిన బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కోళ్ల శివలు పరామర్శించారు. మంగళవారం మండల పరిధిలోని చిన్నకార్పాముల గ్రామంలోని బాధిత కుటుంబాలను వారు పరామర్శించి, భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిందితులపై పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనా వారిని అరెస్టు చేయకపోవడం శోచనీయమన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి రిమాండ్ చేయాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు. బీజేపీ మండల అధ్యక్షుడు పదిర భీమేష్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు సాతాని శ్రీను, నాయకులు వారి వెంట ఉన్నారు.

బాధిత కుటుంబానికి స్నేహితుల చేయూత

వెల్దండ, మే 21 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొట్ర గ్రామానికి చెందిన వసంతపు మహేష్ కుటుంబానికి ఆయన స్నేహితులు అండగా నిలిచారు. పదవ తరగతిలో ఒకేచోట చదివిన మహేష్ బాల్యమిత్రులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తమవంతుగా అందరూ పోగుచేసిన రూ.27వేల నగదును మహేష్ భార్య స్వప్నకు అందజేసి, మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో మట్ట చంద్రకాంత్, కొండల్‌యాదవ్, సాయిబాబు, గణేష్‌గౌడ్, వెంకటేష్, రాఘవేందర్, ప్రవీణ్, కుటుంబ సభ్యులు రిషివర్ధన్, జ్ఞానేశ్వర్‌లు ఉన్నారు.

రాజీవ్‌గాంధీ కలలను నెరవేరుస్తాం

» కాంగ్రెస్ నాయకుల వెల్లడి

» పార్టీ ఆధ్వర్యంలో దివంగత ప్రధానికి ఘన నివాళి



నాగర్‌కర్నూల్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

కొల్లాపూర్, మే 21 : దేశ మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతిని కొల్లాపూర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు, కాంగ్రెస్ పార్టీ మునిసిపల్ కౌన్సిలర్ షేక్.రహీంపాష, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఎండీ.ఎక్బాల్‌లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో ఉన్న బడుగు, బలహీన వర్గాల ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని, రాజీవ్‌గాంధీ ఆశయాలను నెరవేరుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కాంతారావు, నాయకులు పాల్గొన్నారు.

చిన్నారులకు పండ్లు, బ్రెడ్ల పంపిణీ

ఇందిరాగాంధీ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు, టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీవాణి విద్యాలయంలో రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. అనంతరం చిన్నారులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది మధుసూదన్‌రావు, నాయకులు జమీల్‌అహ్మద్‌ఖాన్, వెంకటస్వామి, జుబేర్‌ఖాన్, జావీద్‌ఖాన్ పాల్గొన్నారు.

● నాగర్‌కర్నూల్ టౌన్ : పట్టణంలోని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటుచేసిన రాజీవ్‌గాంధీ చిత్రపటానికి ఎమ్మెల్సీతో పాటు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ దేశంలో సాంకేతిక రంగంలో పెనుమార్పులు తీసుకువచ్చిన నేత రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.హబీబ్, కౌన్సిలర్ నిజాముద్దీన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లభ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రేణుబాబు, నాయకులు పాల్గొన్నారు.

● అచ్చంపేట టౌన్ : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నాయకుడు గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రామనాథం తదితరులు పాల్గొన్నారు.

● కల్వకుర్తి : పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి స్థానిక నాయకులతో కలిసి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుస్థిరపాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ పసుల సుదర్శన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ షానవాజ్‌ఖాన్, జమ్ముల శ్రీకాంత్, మాజీ సర్పంచ్ జిల్లెల రాములు, మహిళా నాయకురాలు రేష్మాబేగం, నాయకులు పాల్గొన్నారు.

● వెల్దండ : మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, టెక్నాలజీ రంగానికి రాజీవ్‌గాంధీ చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.

● బిజినేపల్లి : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● మన్ననూర్ : మన్ననూరులోని శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపై రాజీవ్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి సంబు వెంకట్‌రమణ, కోఆప్షన్ సభ్యుడు రహీం, కాంగ్రెస్ నాయకులు జూలూరి సత్యనారాయణ, రాజేంద్రప్రసాద్, గోపాల్, శివాజి, జంగయ్య, కృష్ణయ్య, రహిమాన్ పాల్గొన్నారు.

● లింగాల : మండలంలోని దారారం గ్రామంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి యువజన కాంగ్రెస్ అచ్చంపేట నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ రాథోడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి రాజీవ్‌గాంధీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో చిన్నారులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు



కల్వకుర్తిలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్

మామిడి రైతులు అధిక లాభాలు పొందాలి

» కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



మామిడి రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలోని మామిడి రైతులు ఆధునిక పద్ధతులతో సాగు చేసి నాణ్యమైన పండ్ల ఉత్పత్తులు సాధించాలని అదేవిధంగా దిగుబడితో పాటు, ఎగుమతులు చేసి అధిక లాభాలు పొందాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మామిడి సాగులో యాజమాన్య పద్ధతులతో పాటు, ఎగుమతులు, అధిక లాభాలపై జిల్లా రైతులకు నిర్వహించిన ఒకరోజు అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. నాగర్‌కర్నూల్ ప్రాంతం అన్ని పంటల సాగుకు అనుకూలమని, రైతులు ఉద్యాన, మామిడి పంటలు సాగు చేస్తూ ఆర్థికంగా ఎదగాలన్నారు. కొల్లాపూర్ మామిడికి ప్రపంచ దేశాల్లోనే మంచి గుర్తింపు ఉందని, అందుకనుగుణంగా రైతులు నూతన వ్యవసాయ పద్ధతుల ద్వారా మార్కెట్‌కనుగుణంగా ఉత్పత్తులు చేసి అధిక లాభాలు ఆర్జించాలని సూచించారు. ప్రభుత్వం ఉద్యానవన పంటల సాగుకు అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఇప్పటికే జిల్లాలో 14,419 మంది రైతులు 33వేల 523ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోటలు సాగు చేస్తున్నారన్నారు. జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల ఆధ్వర్యంలో రైతుల నుంచి మామిడి కాయలు కొనుగోలు చేసి వివిధ దేశాలకు ఎగుమతులు చేస్తూ లాభదాయకమైన మార్కెట్లను నిర్వహిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. కొల్లాపూర్ పరిసరాల్లో పండుతున్న మామిడి పండ్లు మంచి రుచికరంగా విదేశాలకు ఎగుమతి చేసే విధంగా ఉంటుందన్నారు. అందుకు రైతులు ఆధునాతన మార్కెట్ పద్ధతుల మెళకువలను పాటిస్తూ దేశ విదేశాలకు జిల్లా నుంచి మామిడిని ఎగుమతి చేసి అధిక లాభాలు పొందాలని సూచించారు. రైతులు పంట సాగుతో పాటు మార్కెట్ మెళకువలను పాటించడం అతి ముఖ్యమన్నారు. సదస్సును విజయవంతంగా నిర్వహించిన అధికారులను కలెక్టర్ సత్కరించి, మెమెంటోను బహూకరించారు. మామిడి రైతుల సదస్సులో రాష్ట్ర ఉద్యానవన శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏ.ప్రేమ్‌సింగ్, నాబార్డు ఏజీఎం ఆర్‌పీ.నాయుడు, జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి బి.చక్రపాణి, వనపర్తి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్, వికారాబాద్ ఉద్యానవన అధికారి కమల, రాష్ట్ర ఉద్యానవన శాఖ అధికారి మహేష్, నాబార్డు డీడీఎం మనోహర్‌రెడ్డి, డీఆర్‌డీవో చిన్నఓబులేష్, ఎల్‌డీఎండీ కౌశల్‌కిశోర్, పాండే, కేవీకే పాలెం ఉద్యానవన శాస్త్రవేత్త ఆదిశంకర్, ఉద్యానవన శాఖ కొల్లాపూర్ అధికారి ఎం.లక్ష్మణ్, కల్వకుర్తి ఉద్యానవన శాఖ అధికారి ఇమ్రాన్, మామిడి రైతులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఉప్పునుంతల, మే 21 : మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10:30 గంటలకు ఎంపీపీ తిప్పర్తి అరుణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మణ్‌రావు తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరు కానున్నారని ఆయన పేర్కొన్నారు.

ఈనెల 24న పాలెంలో విత్తనమేళా

తిమ్మాజిపేట, మే 21 : ఈనెల 24న పాలెం ప్రాంతీయ కళాశాల ఆవరణలో నిర్వహించే విత్తన మేళాకు రైతులు అధిక సంఖ్యలో రావాలని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ తెలిపారు. తిమ్మాజిపేటలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వరిలో ఆర్ఎన్ఆర్, కేఎన్ఎం రకాలు కంది, ఉలవలు, మినుములు, పెసర, ఆముదం, పచ్చజొన్న, జొన్న, తెల్లజొన్నలతో పాటు రాగి, సజ్జలు, కొర్రలు, వేరుశనగలు వంటివి అందుబాటులో ఉంటాయన్నారు. గ్రామాల వారీగా రైతులు పెద్దఎత్తున వచ్చి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

» క్రైమ్ డీఎస్పీ గిరికుమార్

కల్వకుర్తి, మే 21 : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని క్రైమ్ డీఎస్పీ గిరికుమార్ కోరారు. మంగళవారం కల్వకుర్తిలోని పోలీస్‌స్టేషన్‌లో సైబర్ నేరాల్లో డబ్బులు పోగొట్టుకున్న బాధితులతో ఆయన సమావేశమయ్యారు. సైబర్‌లో డబ్బులు పోగొట్టుకున్న వారు 1930 నెంబరుకు ఫిర్యాదు చేస్తే నేరస్తుల ఖాతాలను ఫ్రీజ్ చేస్తామని తెలిపారు. పోగొట్టుకున్న డబ్బులను బాధితులకు కోర్టు ద్వారా ఇప్పిస్తామని గిరికుమార్ తెలిపారు. జూన్ 8న కల్వకుర్తిలో మెగా లోక్ అదాలత్ ఉంటుందని ఆయన తెలిపారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్ టౌన్, మే 21 : జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో 3, 5, 8 తరగతుల్లో ప్రవేశాలకు జూన్ ఆరవ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి కమలాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో మూడో తరగతికి 10, ఐదో తరగతికి ఆరు, ఎనిమిదో తరగతికి నాలుగు సీట్లు ఉంటాయని తెలిపారు. ప్రవేశాలు కోరే విద్యార్థులు నాగర్‌కర్నూల్ జిల్లా నివాసులై ఉండి, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు వార్షిక ఆదాయం కలిగి ఉండాలని సూచించారు. గెజిటెడ్ అధికారితో అటెస్టెడ్ చేయించిన స్థానిక, కుల, ఆదాయం, జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు పాఠశాల బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను దరఖాస్తుతో జతపరచాలని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన జిల్లాలోని గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

మన్ననూరు పీవీటీజీ గురుకుల కళాశాలలో రేపు స్పాట్ అడ్మిషన్లు

మన్ననూర్, మే 21 : అమ్రాబాద్ మండలం మన్ననూరు గిరిజన గురుకుల జూనియర్ కళాశాల (పీవీటీజీ)లో 2024-25 విద్యా సంవత్సరం ఇంటర్ ప్రథమ సంత్సరంలో నేరుగా ప్రవేశాలు కల్పించనున్నట్లు పీటీజీ ప్రిన్సిపాల్ నిమ్మల పద్మావతి తెలిపారు. కళాశాలలో సీఈసీలో 29 సీట్లు, హెచ్ఈసీలో 34 సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 23న మహబూబ్‌నగర్‌లోని రాయచూర్ రోడ్డులో గల ఆల్‌మదీన భవనంలో గల టీడబ్ల్యుఆర్‌జేసీ బాలికల కళాశాలలో కౌన్సెలింగ్‌కు హాజరై ప్రవేశాలను పొందాలని కోరారు.

వైభవంగా నరసింహుడి ఉత్సవాలు



నరసన్నగుట్టపై హోమాలు జరిపిస్తున్న కృష్ణమూర్తిశర్మ



సిర్సవాడలో లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శిఖర సంప్రోక్షణ నిర్వహిస్తున్న వేద పండితులు

తిమ్మాజిపేట, మే 21 : మండల పరిధిలోని అప్పాజీపల్లి శివారులో నరసన్నగుట్టపై స్వయంభువుగా వెలసిన లక్ష్మీనరసింహస్వామి ప్రథమ వార్షిక జయంతి ఉత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా నరసింహస్వామికి అభిషేకం, పుష్పార్చన, సుదర్శన హోమాలను పురోహితులు కృష్ణమూర్తిశర్మ, గంగాధరశర్మలు జరిపించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా తిమ్మాజిపేట గ్రామ నివాసి దాచేపల్లి నరసింహస్వామి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ఆవరణలో తులాభారం చేయించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. బుధవారం నిర్వహించే పలు పూజా కార్యక్రమాల్లోను పాల్గొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

పూర్తయిన శిఖర సంప్రోక్షణ

తాడూరు : మండలంలోని సిర్సవాడ లక్ష్మీనరసింహస్వామి జయంతి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించిన అనంతరం ఆలయం పునర్నిర్మించి 12 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో పంచామృతాలతో శిఖర సంప్రోక్షణ కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో చేపట్టారు. అనంతరం లోక కల్యాణార్థం దంపతుల ఆధ్వర్యంలో యజ్ఞ నిర్వాహకులైన భద్రప్ప, నరసింహారెడ్డి, బుచ్చయ్యగౌడ్, బాల్‌రెడ్డి, జంగిరెడ్డి, భీమలింగంగౌడ్ ఆధ్వర్యంలో గీతాయజ్ఞం నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం ఉన్న నేపథ్యంలో ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. బుధవారం ఉదయం 11 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో పల్లకీసేవ ఉంటుందని ఆలయ అర్చకుడు జగదీశ్వర్ తెలిపారు.

బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి

లింగాల, మే 21 : మండల కేంద్రం నుంచి అప్పాయిపల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేయడం వల్ల వివిధ గ్రామాల ప్రజలు, రైతులు అవస్థలు పడుతున్నారని, బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు సలేశ్వరం డిమాండ్ చేశారు. మంగళవారం అప్పాయిపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో రహదారి మీదుగా అలుగు పారుతుందని, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులకు గురికాకుండా వెంటనే బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు.

సీనియర్ మేట్ల సదస్సును జయప్రదం చేయాలి

కల్వకుర్తి, మే 21 : ఎన్ఆర్ఈజీఎస్ సీనియర్ మేట్ల జిల్లా సదస్సును బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చింత ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈజీఎస్‌లో పనిచేస్తున్న సీనియర్ మేట్లను ఫీల్డ్ అసిస్టెంట్లుగా చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు గతంలో మాదిరిగానే గడ్డపార, పార, తట్ట, మంచినీళ్లకు డబ్బులు ఇవ్వాలని, పెండింగ్ లేకుండా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సీనియర్ మేట్ల సమస్యల పరిష్కారానికి జిల్లా సదస్సులో పలు తీర్మానాలు చేయనున్నామని, జిల్లాలోని సీనియర్ మేట్లు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

హరితహారం లక్ష్యం నెరవేరేనా..

» మొక్కలను సంరక్షించడంలో శ్రద్ధ చూపని అధికారులు, ప్రజాప్రతినిధులు



కోడేరులోని నర్సరీలో పెంచుతున్న మొక్కలు

కోడేరు, మే 21 : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. పచ్చదనం ప్రగతికి మెట్లు.. మొక్కల పెంపకం వల్లనే వర్షాలు వస్తాయని.. వాతావరణ కాలుష్యం తదితర సమస్యలకు పరిష్కారం మొక్కల ద్వారానే సాధ్యం. ఇక అడవుల విస్తరణ కోసం ప్రభుత్వం హరితహారం ద్వారానే మొక్కలను నర్సరీల్లో పెంచడానికి పూనుకున్నది.

కోడేరు మండలంలో 22 గ్రామ పంచాయతీలున్నాయి. ప్రతీ పంచాయతీలో 5వేలు, 7వేలు, 10వేలు ఇలా మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నామని ఏపీవో నాగరాజు తెలిపారు. ఇలా గ్రామాల్లో పెంచిన మొక్కలను రోడ్లకిరువైపులా, ప్రభుత్వ భూముల్లో పెంచడానికి ప్రభుత్వం ఈజీఎస్ కూలీల ద్వారా మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టింది. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. గతంలో నాటిన మొక్కలను సంరక్షించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ చూపడం లేదు. దీంతో ప్రజాధనం వృథా అవుతోందని పలువురు చర్చించుకుంటున్నారు. నాటిన మొక్కల సంరక్షణకు కంచెలు ఏర్పాటు చేసి మొక్కలకు నీళ్లు పోసే కార్యక్రమం చేపట్టినా మొక్కుబడిగా పనులు చేయడంతో ఎండిపోయాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్ల వెంట నాటిన మొక్కలు మాత్రమే అక్కడక్కడా కనిపిస్తున్నాయని, ప్రభుత్వ భూముల్లో, పొలం గట్లపైన నాటిన మొక్కలు పూర్తిగా ఎండిపోయాయని ఆయా గ్రామాల ప్రజలు అధికారుల పనితీరుపై విమర్శలు చేస్తున్నారు.

ఇప్పటికైనా నాటిన మొక్కలకు కంచె ఏర్పాటు చేసి మొక్కలకు నీళ్లు పెట్టాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని నెరవేర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మొక్కలను సంరక్షించే బాధ్యత తీసుకుంటున్నాం..



మండలంలో గతంలో హరితహారం పథకం కింద నాటిన మొక్కలు అక్కడక్కడా ఎండిపోయాయి. వాటి స్థానంలో కొత్తగా మొక్కలు నాటి కంచె ఏర్పాటు చేయించి, నీళ్లు పోస్తూ, సంరక్షించే బాధ్యత తీసుకుంటున్నాం. ఈజీఎస్ పథకం ద్వారా మొక్కలు నాటించి వాటిని సంరక్షించే బాధ్యత గ్రామ పంచాయతీ సెక్రటరీతో పాటు ఏపీవోగా మేము కూడా పర్యవేక్షణ చర్యలు చేపడతాం.

- నాగరాజు, ఏపీవో, కోడేరు మండలం